# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 29-10-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **మొంథా తుపాను బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

2. **మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులకు సూచించారు.**

3. **తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.**

4. **రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ శుభేందు సామంత ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు.**

5. **ప్రపంచ పక్షవాత నివారణ దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు.**

==========================

మొంథా తుపాను తీవ్ర వాయుగుండంగా బలహీనపడి ఆంధ్రా, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ భూభాగంపై కొనసాగుతోందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీని ప్రభావంతో రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి 55 నుంచి 65 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తున్నాయని తెలిపింది. తుపాను ప్రభావంతో రాష్ట్రంలోని కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో మోస్తరు నుంచి భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి కరుణాసాగర్ తెలియజేస్తూ,

వాయిస్ .. 25 సెకన్లు

---------------------------

మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లోని బాధితులకు నిత్యావసర సరుకులు అందించాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తుఫాన్ నష్టం, ఆకస్మిక వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై మంత్రులు, అధికారులతో శ్రవణ మాధ్యమ విధానంలో ఈరోజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ముందస్తు చర్యలు తీసుకోవడం వల్ల నష్టాన్ని చాలా వరకు నివారించగలిగామని చెప్పారు. తుపాను నష్టంపై అంచనాలను త్వరితగతిన సిద్దం చేయాలని, వీలైనంత త్వరగా

సాధారణ పరిస్థితులు నెలకొల్పేలా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థను కూడా త్వరితగతిన పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

---------------------------

మొంథా తుపాను ప్రభావిత ప్రాంత ప్రజలకు ఉచితంగా నిత్యావసర సరకుల పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభావిత కుటుంబాలు, మత్స్యకారులకు వీటిని పంపిణీ చేయనున్నామని తెలిపింది. ప్రతి కుటుంబానికి బియ్యం 25 కిలోలు, మత్స్యకారులకు 50 కిలోలు, కిలో కందిపప్పు, ఒక లీటర్ వంటనూనె, కిలో ఉల్లిపాయలు, కిలో బంగాళాదుంపలు,  కిలో చక్కెర పంపిణీ చేస్తామని పేర్కొంది. బియ్యం, కందిపప్పు, నూనె, చక్కెర సరఫరా చేసేందుకు చర్యలు వెంటనే ప్రారంభించాలని  పౌరసరఫరాల శాఖను ఆదేశించారు.  ఉల్లిపాయలు, బంగాళాదుంపలు, ఇతర కూరగాయలు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకోవాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించింది.

---------------------------

మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఉపముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో గుంటూరు జిల్లా మంగళగిరి నుంచి ఆయన ఈరోజు  సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, తుపాను ప్రభావంతో విరిగిపడిన చెట్లు, విద్యుత్ స్తంభాలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. తుపాను బలహీనపడినా భారీ వర్షాలు ఉన్నందున ప్రజలను పునరావాస కేంద్రాల్లోనే ఉంచి ఆహారం, వసతి కల్పించాలని స్పష్టం చేశారు. వర్షాలు తగ్గుముఖం పట్టాక పారిశుద్ధ్య కార్యక్రమాలపై దృష్టి పెట్టాలని పవన్ కళ్యాణ్ సూచించారు.

---------------------------

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపడుతున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పెదమైనవానిలంక పునరావాస కేంద్రాన్ని మంత్రి ఈ రోజు పరిశీలించారు. పునరావాస కేంద్రంలో గ్రామస్తులకు అందిస్తున్న ఆహారం, వసతులపై ప్రజలను వివరాలు అడిగి తెలుసున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ,

వాయిస్ 20సెకన్లు

---------------------------

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. పల్నాడు జిల్లా, సత్తెనపల్లి నియోజకవర్గంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను నరసారావు పేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలుతో కలిసి ఆమె నిన్న పరిశీలించారు.  అనంతరం మంత్రి మాట్లాడుతూ,

వాయిస్ 33 సెకన్లు

---------------------------

రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ శుభేందు సామంత ఈరోజు ప్రమాణ స్వీకారం చేశారు. అమరావతిలోని నేలపాడు హైకోర్టు ప్రాంగణంలో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్.. జస్టిస్

శుభేందుతో ప్రమాణం చేయించారు. జస్టిస్ శుభేందు కలకత్తా హైకోర్టు నుంచి రాష్ట్ర హైకోర్టుకు బదిలీపై వచ్చారు.

-------------------------------

ప్రపంచ పక్షవాత నివారణ దినాన్ని ఈరోజు నిర్వహిస్తున్నారు. పక్షవాతం వచ్చిన 3 గంటల్లో సరైన చికిత్స అందిస్తే వ్యాధి తీవ్రతను తగ్గించవచ్చని వైద్యులు అవగాహన కల్గిస్తున్నారు. ప్రపంచ పక్షవాత నివారణ దినాన్ని ప్రతీ ఏటా అక్టోబర్ 29వ తేదీన నిర్వహిస్తారు. పక్షవాతం బారినపడి కోలుకున్న తర్వాత తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పక్షవాతం అనంతరం మెరుగైన జీవనాన్ని సాగించేందుకు పాటించవలసిన విధానాల పట్ల ప్రజలను చైతన్యపరుస్తూ పక్షవాత నివారణ దినాన్ని నిర్వహిస్తున్నారు.

-------------------------------

రాష్ట్రంలో అంతర్గత జలమార్గాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వంతో అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు. మహారాష్ట్రలోని ముంబైలో కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రిత్వ శాఖ నిర్వహిస్తోన్న ఇండియా మారిటైమ్ వీక్ 2025 కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సమక్షంలో ఇన్ ల్యాండ్ వాటర్ వే అథారిటీ ఆఫ్ ఇండియాతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. అనంతరం మంత్రి మాట్లాడుతూ, ఈ ఒప్పందం రాష్ట్రంలో అంతర్గత జల మార్గాల అభివృద్ధికి ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు. అంతర్గత జలమార్గాల అభివృద్ధి ద్వారా సరుకు రవాణా వ్యయం భారీగా తగ్గనుందని మంత్రి ఆశాభావం వ్యక్తంచేశారు.

-------------------------------

భారీ వర్షాల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దు చేసింది. 127 రైళ్లను తాత్కాలికంగా రద్దు చేయడంతో పాటు మరో 14 రైళ్లను దారి మళ్లించామని తెలిపింది. ఫలక్‌నుమా, ఈస్ట్‌కోస్ట్, గోదావరి, విశాఖ, నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్‌లు రద్దు చేశామని, వర్షాల కారణంగా పలు రైల్వేస్టేషన్లలో రైళ్లు నిలిచిపోయాయని పేర్కొంది. రాష్ట్రంలోని  పలు స్టేషన్లలో 12 గూడ్స్ రైళ్లు నిలిచిపోయాయని తెలిపింది.

-------------------------------

తిరుమలలో పది రోజులు వైకుంఠ ద్వారా దర్శన విధానం కొనసాగించాలని నిర్ణయించామని తిరుమల తిరుపతి దేవస్థానం – టిటిడి ఛైర్మన్ బి.ఆర్.నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ అధ్యక్షతన పాలకమండలి సభ్యులు నిన్న సమావేశమయ్యారు. అనంతరం బి.ఆర్.నాయుడు  మాట్లాడుతూ వైకుంఠ ఏకాదశి, ద్వాదశికి పదిరోజుల పాటు ఆలయ వైకుంఠ ద్వారాలను తెరిచి భక్తులకు దర్శనం కల్పిస్తామన్నారు. అలాగే ఒంటిమిట్ట ఆలయం వద్ద వంద గదుల భవనం నిర్మాణానికి, చెన్నైలో వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణం కోసం స్థలం కొనుగోలుకు  నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

=======================